క్లుప్తంగా

బతుకమ్మకు పూజలు

గంపలగూడెం: గంపలగూడెం గాంధీసెంటర్, రావిచెట్టు బజారు, దళితవాడ, వినగడప పంచముఖ సుందరహనుమత్‌పీఠం, మేడూరు, పెనుగొలను, ఊటుకూరు, కొణిజెర్ల, ఆర్లపాడు తదితర గ్రామాల్లో బతుకమ్మకు విశేష పూజలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మహిళలు వివిధ రకాల పిండివంటలు తయారు చేసి బతుకమ్మ చుట్టూ కూర్చొని బుధవారం అమ్మవారిని కొలుస్తూ పాటలు పాడి, ఆటలు ఆడారు.

ఎస్సీ వర్గీకరణ కోసం పాదయాత్ర

రెడ్డిగూడెం: వచ్చే శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని మందకృష్ణమాదిగ చేపట్టిన హలంపూర్ నుంచి హైదరాబాదు విశ్వరూప పాదయాత్రకు సంఘీభావంగా రెడ్డిగూడెంలో రెండోరోజు బుధవారం ఎంఎస్పీ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లాది వీరయ్య మాదిగ, రెడ్డిగూడెం ఎంఎస్పీ ఇన్‌చార్జి మల్లాది రామారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు



తిరువూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో దసరా సెలవుల్లో విద్యార్థులకు చేపట్టిన ఉచిత శిక్షణ కార్యక్రమంలో బుధవారం పద్య పఠన పోటీలు నిర్వహించారు. భగవద్గీత పఠనం, పెద్ద బాలశిక్ష చదవడం, చదరంగం, చిత్రలేఖన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి పద్మావతి తెలిపారు. ఈ నెల 24న విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

దసరా ఏర్పాట్లపై సబ్ కలెక్టర్ సమీక్ష



నూజివీడు: స్థానిక శ్రీకోట మహిషాసురమర్దిని అమ్మవారి ఆలయంలో 67వ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 23న నిర్వహించే దసరా వేడుకల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ బుధవారం తన కార్యాలయంలో సమీక్షించారు. దసరా వేడుకలకు వేలాది మంది ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రధాన రహదారుల వెంబడి ట్రాఫిక్కును మళ్లించి, ఇబ్బందులు తొలగించాలని సూచించారు. ప్రత్యేక అంగళ్ల ఏర్పాటుపై అధికారుల పర్యవేక్షణ కొనసాగాలన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, ఎస్సైలు శాగం రాధాకృష్ణారెడ్డి, వెంకటేష్, ఆలయ ఈఓ శ్రీనివాసరావు, సెబ్ ఇన్‌స్పెక్టర్ టి.గోపాలకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు జి.సత్యనారాయణచార్యులు పాల్గొన్నారు.

దసరా వేడుకలకు సర్వం సిద్ధం



నూజివీడు: నూజివీడు పట్టణంలో దసరా వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్టు దసరా ఉత్సవ కమిటీ కార్యదర్శి పగడాల సత్యనారాయణ, స్పోర్టింగ్ క్లబ్ ప్రెసిడెంట్ రామిశెట్టి మురళీకృష్ణ కుమార్ తెలిపారు. స్థానిక విక్టోరియా టౌన్ హాల్లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దసరా వేడుకల నిర్వహణలో రెండో మైసూరుగా పేరుగాంచిన నూజివీడులో దసరా ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పురాతన సంప్రదాయంలో భాగంగా బుట్ట బొమ్మల ప్రదర్శన దసరా వేడుకల్లో ఆకర్షణగా నిలవనున్నట్టు చెప్పారు. సంప్రదాయ నృత్యాలు, కోలాటం, గరగ నృత్యం, బేతాళ డ్యాన్స్ తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో రాష్ట్ర స్థాయి పురుషుల, మహిళల కబడ్డీ పోటీలను ప్రతిష్టాత్మకంగా డీఏఆర్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నామని, రాష్ట్రస్థాయి జట్లు పాల్గొంటాయని చెప్పారు. రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ టీవీ కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోటగిరి సతీష్, రంగ బాబు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం



పోతనపల్లిలో వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు



తిరువూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

చాట్రాయి: 'జగనన్న ఆరోగ్య సురక్ష' ప్రతిష్టాత్మకమైన కార్యక్రమమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. చాట్రాయి మండలం పోతనపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే తపనతో పలు రకాలు వైద్య సేవలు అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రతి కుటుంబంలో ప్రతి వ్యక్తీ ఆరోగ్యంగా ఉండాలన్న ఆలోచనతో ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్యశ్రీ, 108, 104 వాహనాల ద్వారా ఇంటి ముంగిటకే వైద్యం అందిస్తున్నట్టు చెప్పారు. అనంతరం 378 మందికి డాక్టర్లు వైష్ణవి, కిరణ్మయ్, విజయలక్ష్మిలు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, గ్రామ సర్పంచ్ బాణావతు సావిత్రి, ఎంపీటీసీ సభ్యురాలు భారతి, వైస్ ఎంపీపీ సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వాసు, వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు రవీంద్రరెడ్డి, డీఎంహెచ్ఓ ఆశ, తహసీల్దార్ విశ్వనాథరావు, ఎంపీడీఓ దుర్గా ప్రసాదు పాల్గొన్నారు.

750 మందికి వైద్య పరీక్షలు

కొణిజెర్ల(గంపలగూడెం): గంపలగూడెం మండలం కొణిజెర్లలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యులు 750 మంది రోగులను వైద్యులు భానుతేజ, వాసవి, శశిప్రియ, సురేష్, శ్రీనివాసరావు పరీక్షించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. రోగులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు బొల్లా కరుణాకరరావు, సర్పంచ్ ఇలవరపు నాగమణి, ఎంపీటీసీ సభ్యురాలు రాధమ్మ, సొసైటీ అధ్యక్షుడు వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యం

జి.కొండూరు: పేదలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. మండలంలోని వెంకటాపురంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని స్థానిక నాయకులతో కలిసి ఎంపీపీ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావు, ఎంపీటీసీ సభ్యురాలు విజయశ్రీ పాల్గొన్నారు.

పేదల ముంగిటకే వైద్యం

తిరువూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదల ముంగిటకే వైద్యసేవలందుతున్నాయని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో 12, 13వ వార్డుల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని బుధవారం ఎమ్మెల్యే రక్షణనిధి ప్రారంభించారు. దీర్ఘకాలిక రోగులు, దివ్యాంగులు ఆస్పత్రులకు వెళ్లే అవసరం లేకుండా వైద్యులే ఇంటి వద్దకు వచ్చి వైద్యం అందించే ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ఎంతో ప్రయోజన కరంగా ఉందన్నారు. తిరువూరు నగరపంచాయతీ చైర్‌పర్సన్ కస్తూరిబాయి, వైస్‌చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, మోదుగు ప్రసాద్, పసుపులేటి శేఖర్‌బాబు, మూడు దుర్గా, పసుపులేటి సత్యనారాయణ, ఇనపనూరి చిన్నారి, పరసా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

వేమిరెడ్డిపల్లిలో..

వేమిరెడ్డిపల్లి (విస్సన్నపేట): ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మండలంలోని వేమిరెడ్డిపల్లి గ్రామసచివాలయం పరిధిలో స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం బుధవారం నిర్వహించారు. వైద్యశిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడారు. పేదలకు ఉచితంగా తమ గ్రామంలోనే వైద్యసేవలు అందించటం జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, సర్పంచ్ పి.విజయకుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శివబాజీ, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణచారి, నాయకులు సుబ్బారావు, శివయ్య, రమేష్, సొసైటీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

నూజివీడు: పేదల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని జంగంగూడెం సర్పంచ్ పొట్లూరి అంజనీకుమారి అన్నారు. జంగంగూడెంలో బుధవారం ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ డీవీఎస్ యల్లారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పొట్లూరి అశోక్, వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోలుపడిలో...

రోలుపడి(తిరువూరురూరల్): మండలంలోని రోలుపడిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ ముండ్లపాటి కాంతమ్మ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. రోలుపడి, రాజీవ్‌నగర్, సూరవరం గ్రామాల్లోని రోగులకు వైద్యశిబిరంలో ఉచిత మందుల కిట్లను పీఏసీఎస్ చైర్‌పర్సన్ బండి రవికుమార్ అందజేశారు. చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు ఈ శిబిరంలో రోగులకు సేవలందించారు.



గంపలగూడెం మండలం కొణిజెర్లలో మందులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



జి.కొండూరు మండలం వెంకటాపురంలో వృద్ధురాలికి మందుల కిట్‌ను అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ



వేమిరెడ్డిపల్లిలో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

వైఎస్సార్ బీమా అందజేత

చంద్రగూడెం(మైలవరం): చంద్రగూడెం గ్రామంలో లబ్ధిదారుకు వైఎస్సార్ బీమా కింద రూ.10వేలను గ్రామ సర్పంచ్ బొలగాని శ్రీనివాసరావు బుధవారం అందజేశారు. మైలవరం మండలం చంద్రగూడెం గ్రామానికి చెందిన బొలగాని బాజీబాబు అనారోగ్యంతో మ రణించాడు. వైఎస్సార్ బీమా కింద రూ.10వేలను మృతుడి భార్య లక్ష్మీకి అందజేశారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకోండి

ఆగిరిపల్లి: ప్రధానమంత్రి ఉజ్వల యోజన ఉచిత కొత్త గ్యాస్ కనెక్షన్‌కు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు స్థానిక శ్రీ భాగ్యలక్ష్మి ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు బుధవారం తెలిపారు. తెల్లరేషన్ కార్డు, భార్యాభర్తల ఆధార్ జిరాక్సు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు సమర్పించాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ మహిళల కులధ్రువీకరణ పత్రం కూడా జత చేయాల్సి ఉంటుందని తెలిపారు.

108 హారతులు

తిరువూరు: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో మహిళా విభాగం ఆధ్వర్యంలో దసరా వేడుకల్లో భాగంగా బుధవారం అమ్మవారికి 108 హారతులు ఇచ్చారు. సౌందర్య లహరి కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు. చిన్న పిల్లలకు గ్రూప్ గేమ్, ఏక్ మినిట్ పోటీలు నిర్వహించారు.

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ రాజశేఖర్



తిరువూరు నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

తిరువూరు: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషిచేయాలని ఎమ్మెల్సీ, పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ కోరారు. తిరువూరు నియోజకవర్గ స్థాయిలో 'ఏపీకి జగనే సీఎం కావాలి' కార్యక్రమంపై జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. గత నాలుగున్నర సంవత్సరాల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించేందుకు పార్టీ నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. చేసిన అభివృద్ధిని చెప్పి ప్రతి కుటుంబాన్నీ కలిసి మళ్లీ వైఎస్ జగన్‌మోహనరెడ్డినే సీఎం చేయడానికి గ్రామస్థాయి నుంచి కృషి జరగాలన్నారు. నవంబరు 1 నుంచి జరిగే కార్యక్రమంలో బాధ్యులు తమ పరిధిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. త్వరలో జరిగే బసు యాత్ర కూడా విజయవంతం చేయాలని రాజశేఖర్ కోరారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ గెలుపు సామాన్య కార్యకర్త గెలుపుగా భావించాలని, ప్రతి నియోజకవర్గంలోనూ పార్టీ విజయమే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా పార్టీ ప్రతి గ్రామంలో ప్రతి కుటుంబానికీ చేరువైందని, ఇదే స్ఫూర్తితో పార్టీ కేడర్ ఏపీకి జగనే సీఎం కావాలనే నినాదాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. తిరువూరు, గంపలగూడెం, ఏకొండూరు జెడ్పీటీసీ సభ్యులు యరమల రామచంద్రారెడ్డి, గద్దల శామ్యూల్, భూక్యా గన్యా, ఎంపీపీలు గద్దల భారతి, వనజాక్షి, విజయలక్ష్మి, శ్రీలక్ష్మి, తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ రేగళ్ల మోహన్‌రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కాలసాని విజయలక్ష్మి, నగర పంచాయతీ కౌన్సిలర్లు, నాయకులు సత్యనారాయణ, సచివాలయ సారథులు, నియోజకవర్గంలోని గంపలగూడెం, తిరువూరు, విస్సన్నపేట, ఏకొండూరు మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

మరోసారి సీఎంగా జగన్‌ను గెలిపించుకోవాలి

వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ రాజశేఖర్



మైలవరంలో మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్

మైలవరం: 2024లో జరిగే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులంతా సమర్థవంతంగా పనిచేయాలని పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పిలుపునిచ్చారు. మైలవరం ఎస్వీఎస్ కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే అంశంపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో పేదలందరూ విద్యావంతులు కావాలని, కుటుంబాలను అభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షిస్తూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలని, వైద్య ఖర్చులు లేకుండా ఇంటి వద్దకే వైద్య సౌకర్యం కల్పిస్తున్నారని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధిని ముఖ్యమంత్రి జగన్ చేసి చూపించారని అందుకే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు మళ్ళీ జగనే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారన్నారు. అదేవిధంగా మైలవరం ఎమ్మెల్యేగా వసంత వెంకట కృష్ణప్రసాద్‌ను గెలిపించుకోవాలని తెలిపారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తున్నారన్నారు. మైలవరంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ రాజకీయ లబ్ధిపొందడానికి దేవినేని ఉమా చూస్తున్నాడని, జైలు పక్షులను చూపించి ఓట్లు కొల్లగొట్టడం ఆయన నైజం అన్నారు. 2018లో తాను ఎలా ఉన్నానో ఇప్పుడూ అలానే ఉన్నానని, ఉమాలాగా అందితే జుట్టు, అందక పోతే కాళ్లు పట్టుకునే రకం తాను కాదన్నారు. మైలవరానికి నిజాయితీగా ఉండే వారు కావాలా లేక గోబెల్ ప్రచారం చేస్తూ అబద్ధాలను నిజం చేయడానికి ప్రయత్నిస్తూ, నీతి నిజాయతీ లేని ఉమా కావాలో నియోజకవర్గ ప్రజలు నిర్ణయించుకుంటారని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పరిశీలకులు పడమట సురేష్‌బాబు, నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

గంపలగూడెం: గంపలగూడెం మండలం నెమలిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద నిర్వహించే కార్యక్రమంలో గంపలగూడెం, ఊటుకూరు పీహెచ్‌సీ వైద్యులు, స్పెషలిస్టు డాక్టర్లు పాల్గొని రోగులకు వైద్యసేవలు అందజేస్తారని పేర్కొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: విస్సన్నపేట గ్రామ సచివాలయం–4 పరిధిలో స్థానిక జెడ్పీ హైస్కూల్లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ బుధవారం తెలిపారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే కె.రక్షణనిధి ప్రారంభిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు పేర్కొన్నారు.

బత్తులవారిగూడెంలో..

నూజివీడు: మండలంలోని బత్తులవారిగూడెంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిఒంచనున్నట్టు ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు ప్రజలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేస్తారని, మెరుగైన చికిత్స అవసరమైన వార్ని ప్రభుత్వ ఆసుపత్రిలకు లేదా వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో విజయవాడలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రిలకు రిఫర్ చేస్తారని వివరించారు. ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ విజ్ఞప్తి చేశారు.

సత్యాలపాడులో ఇంటింటికీ కుళాయి

సత్యాలపాడు(గంపలగూడెం): ఇంటింటికీ కుళాయి ఇచ్చిన గ్రామంగా గంపలగూడెం మండలం సత్యాలపాడును అధికారులు ప్రకటించారు. జల్ జీవన్‌మిషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింటికీ ట్యాప్ కనెక్షన్ ఏర్పాటు చేసినట్లు బుధవారం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మానిటరింగ్ కో–ఆర్డినేటర్లు రామకృష్ణ, నాగేశ్వరరావు తెలిపారు. సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ రామా శేషాచార్యులు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ టీఎస్ స్వామినాయక్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

ఆగిరిపల్లి: ప్రజల ఆరోగ్య పరిరక్షణే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు అన్నారు. మండలంలోని నెక్కలంగొల్లగూడెంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 520 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగవరపు రమేష్, తహసీల్దార్ ఉదయభాస్కర్, ఎంపీడీఓ పి.శంకరరావు, వైద్యులు జాస్తి జగన్‌మోహన్‌రావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పలగాని నరసింహారావు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, నాయకుడు భాస్కర్ ప్రసాద్ పాల్గొన్నారు.

మహాలక్ష్మీ కరుణించమ్మా..!



మైలవరం తిరువూరు రోడ్డులోని అమ్మవారికి కరెన్సీ నోట్లతో అలంకారం



పెనుగొలను శివాలయంలో మహాలక్ష్మి అలంకారం




నెమలిలో గజలక్ష్మీదేవిగా అమ్మవారు



బలివేలో అన్నపూర్ణేశ్వరీ దేవిగా అమ్మవారు



తిరువూరులో ధనలక్ష్మి అలంకారం



నూజివీడులో మహాలక్ష్మీ దేవిగా కోట మహిషమ్మ



వామకుంట్లలో శాకంబరీ అలంకారం

గంపలగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో ఆయా ఆలయాలు, ప్రత్యేక పందిళ్లలో ఏర్పాటు చేసిన అమ్మవారికి బుధవారం మహాలక్ష్మి అలంకరణ చేసి విశేష పూజలు జరిపారు. 'మహాలక్ష్మీ కరుణించమ్మా.. కాపాడమ్మా' అంటూ భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గంపలగూడెం గాంధీసెంటర్‌లో ఆర్యవైశ్య మహిళాసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో అర్చకులు తూకుంట్ల లక్ష్మణశాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

అమ్మవారికి కరెన్సీ నోట్లతో అలంకారం

మైలవరం: మైలవరం తిరువూరు రోడ్డులోని శ్రీ రుక్మిణీ సమేత శ్రీపాండురంగ ఆలయంలో దేవీ నవరాత్రులు పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని రూ.లక్ష కరెన్సీ నోట్లతో బుధవారం అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

గజలక్ష్మీదేవికి పూజలు

నెమలి(గంపలగూడెం): గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం గజలక్ష్మీదేవికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు.

అన్నపూర్ణేశ్వరి పంటలను కాపాడు తల్లి

బలివే (ముసునూరు): అన్నపూర్ణేశ్వరి పంటలు కాపాడు తల్లి అంటూ దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా నాలుగో రోజు బుధవారం అన్నపూర్ణ అమ్మవారికి మహిళలు పూజలు చేశారు. బలివేలోని ప్రసిద్ధ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలోని ఉప ఆలయం రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారిని కమిటీ చైర్మన్ నాగుల నాగేశ్వరరావు, ఈఓ ఆకుల కొండలరావు ఆధ్వర్యంలో అర్చకులు చావలి అమర్ బాబు అన్నపూర్ణ మాతగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు.

భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన

గంపలగూడెం: గంపలగూడెం గాంధీసెంటర్‌లో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా దుర్గాదేవి అమ్మవారికి లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు తూకుంట్ల లక్ష్మణశాస్త్రి , శివయ్య నిర్వహించిన కార్యక్రమంలో 120 మంది మహిళలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: దేవీశరన్నవరాత్రుల వేడుకల్లో భాగంగా నాలుగో రోజు దుర్గమ్మ అమ్మవారికి నగదుతో మహాలక్ష్మీ దేవిగా అలంకరణ చేశారు. కొటికలపూడి దాసాంజనేయస్వామి ఆలయం వద్ద రూ.11.16 లక్షలతో అమ్మవారిని అలంకరించారు. రామాలయం వద్ద అమ్మవారిని రూ.5 లక్షలతో అలంకరించారు. కిలేశపురం శ్రీగంగానమ్మ ఆలయంలో అమ్మవారిని రూ.1.30 లక్షలతో అలంకరణ చేసి పూజలు చేశారు.

శ్రీ మహాలక్ష్మీదేవిగా కోట మహిషమ్మ

నూజివీడు: పట్టణంలో పలు ఆలయాలలో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నారు. స్థానిక శ్రీకోట మహిషాసురమర్దని అమ్మవారు బుధవారం మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని భక్తులు ఉదయం నుంచి పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి దర్శించుకున్నారు.

వామకుంట్లలో..

వామకుంట్ల(తిరువూరురూరల్): మండలంలోని వామకుంట్లలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించారు. పలు రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారిని అలంకరించి పూజాదికాలు నిర్వహించారు.

ధనలక్ష్మీ పాహిమాం

తిరువూరు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తిరువూరు పట్టణంలోని పలు ఆలయాల్లో బుధవారం అమ్మవారిని ధనలక్ష్మీదేవిగా, అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. శ్రీగౌరీ కేదారేశ్వరాలయంలో అన్నపూర్ణాదేవి, శ్రీఅష్టలక్ష్మీ ఆలయంలో గజలక్ష్మిగా, శ్రీషిర్డిసాయి మందిరం, ఆర్యవైశ్య కల్యాణమంటపంలో, రామాలయం రోడ్డులోని నవరాత్రి పందిరిలో మహాలక్ష్మీగా, శ్రీకనకదుర్గాలయంలో, జగన్నాధపురం ముత్యాలమ్మ ఆలయంలో ధనలక్ష్మిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

వరి పైరులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



గుంటుపల్లిలో వరి పైరుపై ఆకుముడత, సుడిదోమలు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు సత్యవతి, శైలజ

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): వరిపైరులో చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు రైతులు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయాధికారి బి.సత్యవతి అన్నారు. మండలంలోని గుంటుపల్లిలో వ్యవసాయశాఖ అధ్వర్యంలో విత్తనోత్పత్తి పథకంలో భాగంగా రైతుకుల రెండోవిడత శిక్షణ సదస్సు బుధవారం నిర్వహించారు. ప్రస్తుత తరుణంలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం వరిపైరులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సుడిదోమ, ఆకుచుట్టు పురుగు అధికంగా ఉండటాన్ని గుర్తించారు. వీటిని నివారించకపోతే పొలం ఎండిపోయి తాలు గింజలు వస్తాయన్నారు. లీటరు నీటిలో ఎసిఫేట్ మందు 1.5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఏఓ శైలజ, వీఏఏలు పాల్గొన్నారు.